కళల పరిరక్షణకు సాంస్కృతిక సంస్థలు అవసరం

విశ్వంభర, హిమాయత్ నగర్ : సాంస్కృతిక సంస్థలు కళల పరిరక్షణకు ఎంతో అవసరమని, కొత్తగా మరిన్ని సంస్థలు స్థాపించబడటం సంతోషకర విషయమని భాషా సాంస్కృతిక శాఖ సంచాలకుడు డాక్టర్ ఏనుగు నరసింహా రెడ్డి అన్నారు. హైదరాబాదు హిమాయత్ నగర్ లోని శ్రీముఖి కాంప్లెక్స్‌లోని శారద స్టూడియోస్‌లో కెవీకే ఫైన్ ఆర్ట్స్ అండ్ మెలోడీస్ సంస్థ ప్రారంభ సభ జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న విశ్రాంత డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ డాక్టర్ ని.ఎన్. గోపినాథ్ రెడ్డి, ఏనుగు నరసింహా రెడ్డి, వంశీ సంస్థల అధినేత వంశీ రామరాజుతో కలిసి దీపారాధన చేసి సంస్థను ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ, కప్పా కృష్ణమోహన్ ఉన్నత విద్యావంతుడిగా బ్యాంక్ అధికారిగా సేవలందించి, దూరదర్శన్‌లో న్యూస్ రీడర్‌గా తెలుగు ప్రజలకు సుపరిచితుడని తెలిపారు. ఆకాశవాణి తదితర మాధ్యమాల ద్వారా సాంస్కృతిక కార్యక్రమాలతో అనుబంధం ఉన్న కృష్ణమోహన్ కెవీకే పేరిట సంస్థ ప్రారంభించడం శుభ సూచకమని పేర్కొన్నారు. సుదీర్ఘ కాలంగా సాంస్కృతిక రంగంతో అనుబంధం ఉన్న వంశీ రామరాజు సంస్థకు తోడ్పాటు అందిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వంశీ రామరాజు, గాయకుడు విజయ్ మండపాక, బ్యాంక్ అధికారి శ్రీనివాస్ రావు, స్టార్ 9 న్యూస్ చానెల్ షాబుదిన్ తదితరులు పాల్గొన్నారు. సంస్థ స్థాపకుడు కృష్ణ మోహన్ నివేదిక సమర్పించగా, కార్యదర్శులు జ్యోతిర్మయి, శ్రీలత కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

లెబనాన్‌పై ఇజ్రాయిల్ దాడి సరికాదు

విశ్వంభర, ముషీరాబాదు : లెబనాన్‌పై ఇజ్రాయిల్ దాడి సరికాదని సిపిఐ తెలంగాణ రాష్ట్రసహాయ కార్యదర్శిఈటీనరసింహా అన్నారు. హైదరాబాదు ముషీరాబాదు నియోజక వర్గంలోని మేఫీల్ హోటల్ నుంచి షాప్ టు షాప్ ప్రచారం నిర్వహిస్తూ సిపిఐ హైదరాబాద్ జిల్లా కౌన్సిల్ ఆధ్వర్యంలో విరాళాల సేకరణ చేపట్టారు.ఈసందర్భంగా మాట్లాడుతూ, అమెరికా ప్రపంచ దేశాలపై ఆధిపత్యం సాధించేందుకు యుద్ధాలను ప్రోత్సహిస్తున్నదని విమర్శించారు. కాల్పుల విరమణ ప్రకటిస్తూనే ఇరాన్‌పై ఆర్థిక ఆంక్షలు విధించడం, ఇజ్రాయిల్ ద్వారా లెబనాన్ వంటి దేశాలపై దాడులకు ప్రోత్సాహం ఇవ్వడం ప్రపంచవ్యాప్తంగా ఆందోళన కలిగిస్తున్నదన్నారు. ప్రజలు యుద్ధాలకు వ్యతిరేకంగా శాంతి పరిరక్షణ కోసం ప్రజాస్వామ్య పద్ధతిలో పోరాటాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి స్టాలిన్, సహాయ కార్యదర్శి కమతం యాదగిరి, జిల్లా కార్యవర్గ సభ్యులు చంద్రమోహన్ గౌడ్, నేర్లకంటి శ్రీకాంత్, చెట్టు కింది శ్రీనివాస్, సురేందర్, నాయకులు శ్రీమాన్, చైతన్య, అనిల్ కుమార్, సుశాంత్, ఉదయ్ పాల్గొన్నారు.

రహదారి విస్తరణ పనుల పరిశీలన

విశ్వంభర, షేక్‌పేట్ : జిహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్, హైదరాబాదు పోలీస్ కమిషనర్ వి.సి. సజ్జనార్, జాయింట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ డి. జోయెల్ డేవిస్, హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ ఈడీ, చీఫ్ ఇంజనీర్, ఖైరతాబాదు జోనల్ కమిషనర్, జిహెచ్ఎంసీ ఎస్ఈలతో కలిసి షేక్‌పేట్-టోలిచౌకీ కారిడార్‌లో జరుగుతున్న రహదారి విస్తరణ పనులను పరిశీలించారు. ఈ తనిఖీలలో బజాజ్ ఎలక్ట్రానిక్స్ వద్ద ఫ్రీ లెఫ్ట్ ఏర్పాటు, ఇంటర్నేషనల్ హై స్కూల్ నుంచి లక్ష్మీనగర్ వరకు రహదారి విస్తరణ, షేక్‌పేట్ ఎఫ్ఓబీ నుంచి టోలిచౌకీ ఎఫ్ఓబీ వరకు, అలాగే 7టూంబ్స్ నుంచిబంజారా దర్వాజా వరకు ఉన్న మార్గాలను పరిశీలించారు. నీటి నిల్వల తొలగింపు, డీ సిల్టింగ్, యుటిలిటీలమార్పిడి, అడ్డంకులతొలగింపు, జంక్షన్ అభివృద్ధి, ఎఫ్ఓబీ పనులు, బీటీ రోడ్ల బలోపేతం వంటి అంశాలపై అధికారులు దృష్టి సారించారు. ఈ చర్యల ద్వారా ట్రాఫిక్ రద్దీ తగ్గించి, రహదారి భద్రతను మెరుగుపరచడం తో పాటు ప్రయాణికులకు సౌకర్యవంతమైన కనెక్టివిటీ కల్పించడమే లక్ష్యంగా ఉందని తెలిపారు.

విద్యుత్ ఆర్టిజన్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

విశ్వంభర, ముషీరాబాదు : విద్యుత్ ఆర్టిజన్ కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్ ఎంప్లాయీస్ జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) నాయకులు డిమాండ్ చేశారు. గురువారం హైదరాబాదు అజామాబాద్ విద్యుత్ కార్యాలయం ముందు జేఏసీ ఆధ్వర్యంలో ఆర్టిజన్, అన్‌మ్యాన్డ్, పీస్ట్ కార్మికులు నిరవధిక సమ్మె చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ , వినియోగదారులకు 24 గంటల విద్యుత్ సరఫరా అందించడంలో తాము నిరంతరం పనిచేస్తున్నప్పటికీ తగిన ప్రయోజనాలు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్హతల ఆధారంగా ఆర్టిజన్ ఉద్యోగులను కన్వర్షన్ చేయాలని కోరారు. టీజీఎన్‌పీడీసీఎల్, టీజీఎస్‌పీడీసీఎల్ సంస్థల్లో పనిచేస్తున్న అన్ మ్యాన్డ్ వర్కర్లను ఆర్టిజన్‌లలో విలీనం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జేఏసీ కన్వీనర్ చంద్రరెడ్డి, నాయకులు స్వామి, కత్తి శ్రీను, సైదులు గౌడ్, శ్రీరాములు, బొడ్డు రమేష్, మహేందర్ రెడ్డి, హరీశ్, శ్రీకాంత్, ప్రవీణ్, లక్ష్మీ, సునీత, వీరమణి పాల్గొన్నారు.

సీసీ కెమెరాలు ప్రారంభించిన పోలీస్ కమిషనర్

విశ్వంభర, నిజామాబాద్ : నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ పట్టణంలోని జర్నలిస్ట్ కాలనీలోని భక్త ఆంజనేయ మందిరంలో 22 సీసీ కెమెరాలను నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయి చైతన్య, ప్రారంభించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ, ప్రజల భద్రత కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడము ఎంతో సంతోషమని , ఒక్క సీసీ కెమెరా అనేది 100 మంది పోలీసులతో సమానమని , సీసీ కెమెరాల ద్వారా పట్టణంలో జరిగే అనుమానాస్పద కార్యకలాపాలను సులభంగా గుర్తించి తక్షణ చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందని, సాంకేతిక పరిజ్ఞానం వినియోగంతో పోలీసింగ్‌ను మరింత సమర్థవంతంగా నిర్వహించవచ్చని, నేరాల నివారణలో సీసీ కెమెరాలు ముఖ్యమైన పాత్ర పోషిస్తాయని ఆయన పేర్కొన్నారు. అలాగే ట్రాఫిక్ నియంత్రణలో కూడా ఈ కెమెరాలు పోలీసులకు సహాయపడతాయని వివరించారు. ప్రజలు తమ ప్రాంతాల్లో భద్రత కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని , పోలీస్ శాఖకు సహకరించాలని కమిషనర్ సూచించారు. పోలీస్ శాఖ చేపడుతున్న కమ్యూనిటీ పోలీసింగ్ కార్యక్రమాలకు ప్రజలు ముందుకు వచ్చి భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్మూర్ ఏసిపి వెంకటేశ్వర్ రెడ్డి , ఆర్మూర్ ఎస్హెచ్ఓ సత్యనారాయణ, కౌన్సిలర్ విజయ్ అగర్వాల్ (దియా) , జర్నలిస్ట్ కాలనీ అధ్యక్షులు రాజేందర్ గౌడ్ , సీసీ కెమెరాల ఇన్స్టాలేషన్ ప్రవీణ్ చారి, కాలనీ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా "గిఫ్ట్ ఏ బుక్" ప్రారంభం

విశ్వంభర, తొర్రూర్: ప్రభుత్వ డిగ్రీ కళాశాల గ్రంథాలయ విభాగం ఆధ్వర్యంలో "గిఫ్ట్ ఏ బుక్ – గిఫ్ట్ ఏ ఫ్యూచర్" అనే వినూత్న పుస్తక విరాళాల సేకరణ కార్యక్రమం గురువారం నాడు ఘనంగా ప్రారంభమైంది. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి. రాములు ముఖ్య అతిథిగా విచ్చేసి, స్వయంగా పుస్తకాలను విరాళంగా అందజేసి ప్రారంభించారు. అనంతరం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ, విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో పుస్తకాల పాత్ర కీలకమని, ముఖ్యంగా పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే పేద విద్యార్థులకు ఈ కార్యక్రమం ఒక వరమని కొనియాడారు.గ్రంథాలయానికి పుస్తకాలను విరాళంగా ఇచ్చి విద్యార్థుల విజయాల్లో భాగస్వాములు కావాలని ఆయన కోరారు.నిర్వాహకులు కళాశాల లైబ్రేరియన్ ఎస్. శ్రీనివాస్ మాట్లాడుతూ, "జ్ఞానం పంచితే పెరుగుతుంది" అనే ఆశయంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టామని తెలిపారు. ఈ మొదటి రోజే అధ్యాపక హైదరాబాద్ సిటీ కాలేజీ లైబ్రేరియన్ డాక్టర్ రవికుమార్ గారు ఇప్పటికే 120 పుస్తకాలను అందజేశారని గుర్తు చేశారు.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ బి. రాములు 5 పుస్తకాలు, వాల్యా నాయక్ 5 పుస్తకాలు, అంజుమ్ ఆరా (కెమిస్ట్రీ) 3 పుస్తకాలు వితరణ చేశారు సుజాత, పార్వతి చెరో 2 పుస్తకాలు, రవీందర్ రెడ్డి (ఐ క్యు ఏ సి కోఆర్డినేటర్), కృష్ణవేణి, కిరణ్మయి, విజయ్, రాధిక, రాజేందర్ రెడ్డి తదితరులు ఒక్కో పుస్తకాన్ని విరాళంగా ఇచ్చారు. శాంతి కుమార్ వెయ్యి రూపాయల విలువైన పుస్తకాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐక్యూఏసీ కోఆర్డినేటర్ రవీందర్ రెడ్డి, ఇతర అధ్యాపక బృందం విద్యార్థులు పాల్గొన్నారు.

అమ్మవారికి కమిషనర్ ప్రత్యేక పూజలు

విశ్వంభర, జిహెచ్ఎంసి :ఆబ్కారీ భవన్‌లో కొలువైన శ్రీ లలిత త్రిపుర సుందరి అమ్మవారికి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కమిషనర్ సి.హరికిరణ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆబ్కారీ భవన్‌లో కొవులవైన ఆబ్కారీ భవన్‌లో శ్రీ లలిత త్రిపుర సుందరి అమ్మవారి ఆలయంలో 16వ వార్షికోత్సవ వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. దేవాలయంలో వేద పండితులతో గురువారం ఉదయం 6 గంటల నుంచి లలిత త్రిపుర సుందరి అమ్మవారికి అభిషేకాలు, గణపతి పూజ కార్యక్రమాలు జరిగాయి. ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు చండీ హోమం నిర్వహించారు.హోమ గుండం వద్ద, అమ్మవారి దేవాలయంలో కమిషనర్ సి.హరికిరణ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితులు ఆశ్వీరాదాలు కమిషనర్‌కు అందించారు. కమిషనర్‌తోపాటు దేవాలయ కమిటీ సభ్యులు డీసీ కృష్ణప్రియ,టీజీబీసీఎల్ అసిస్టెంట్ మేనేజర్ విజయలక్ష్మీ, విజయ, జ్ఞానేశ్వర్‌తో ఆబ్కారీ భవన్‌లోని డిప్యూటి డీసీలు, ఏసీలు, ఈఎస్‌లు, సీఐలు, సిబ్బంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి టీఎన్జీవోస్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు మారం జగదీశ్వర్, ముజీబ్ హెస్సెనీ, కస్తూరి వెంకట్వేర్లు, కట్కూరి శ్రీకాంత్ ఇతర ఉద్యోగులు హాజరయ్యారు. అనంతరం అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారి 16వ వార్షికోత్సవం సందర్భంగా ఆబ్కారీ భవన్‌లో ఉద్యోగులందరికి తీర్థ ప్రసాదాలతో పాటు అన్నదానం ఏర్పాటు చేశారు.

రోడ్లపై ధాన్యం ఆరబోయ వద్దు: రైతులకు పోలీసుల విజ్ఞప్తి

విశ్వంభర, సూర్యాపేట: రైతులు రోడ్లపై ధాన్యము ఆరబోయడం వల్ల వాహనదారులు గమనించక రోడ్డు ప్రమాదాల బారిన పడే అవకాశం ఉన్నదని, రైతులు ధాన్యం రోడ్లపై ఆరబోయడం ప్రమాదకరమని, ఎవరు కూడా రోడ్లపై ధాన్యాన్ని ఆరబోయవద్దని జిల్లా ఎస్పీ నరసింహ ఒక ప్రకటనలో కోరారు. ధాన్యం ఆరబోయడం వల్ల వాహనదారులు గమనించక ప్రమాదాల బారిన పడుతున్నారు అన్నారు. కావున రైతులు గమనించి సహకరించాలి అన్నారు. రైతులు రోడ్లపై ఆరబోసిన ధాన్యం కప్పను వాహనదారులు గమనించక ప్రమాదాలకు గురౌతు ప్రాణాలు కోల్పోతున్నారు, క్షతగాత్రులు అవుతున్నారు అని ఎస్పి గుర్తు చేశారు. ధాన్యం అరబోయడం వల్ల ప్రమాదాలు జరిగి ఎవ్వరూ ప్రాణాలు కోల్పోవద్దు అని కోరారు, కావున రైతులు గమనించి రోడ్లపై ధాన్యం. ఆరబోయవద్దు అని విజ్ఞప్తి చేశారు. పోలీసు సూచనలు పాటిస్తూ సహకరించాలి అన్నారు. పోలీసు అధికారులు ఇలాంటి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలి, రైతులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. రాత్రి వేళ పశువులను వదిలి పెట్టవద్దు అని ఎస్పీ కోరారు, వేసవి కాలంలో మేతకోసం పశువులను వదిలిపెట్టడం వల్ల అవి రోడ్లపై వస్తున్నాయి వాహనదారులు గమనించక ప్రమాదాల బారిన పడుతున్నారు అన్నారు.

ప్రతి చిన్నారి రక్షణకు కృషి చేయాలి

విశ్వంభర, బాగ్ లింగంపల్లి: ప్రతి చిన్నారి రక్షణ, గౌరవం, సాధికారత పొందేలా సమాజం మొత్తం కలిసికట్టుగా కృషి చేయాల్సిన అవసరం ఉందని రెయిన్బో హోమ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కొనికేపూడి అనురాధ పేర్కొన్నారు. అంతర్జాతీయ వీధి బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని హైదరాబాదు సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రెయిన్‌బో సంస్థ ఆధ్వర్యంలో వీధి బాలలు ఎదుర్కొంటున్న సమస్యలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా "రక్షించండి, శిక్షించకండి" పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, నిరాధరణకు గురవుతున్న చిన్నారులకు భద్రతతో పాటు సంరక్షణ, ప్రేమ, సరైన మార్గదర్శనం అందించాల్సిన అవసరం ఉందన్నారు. వీధి బాలలకు న్యాయం అందించేందుకు ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు, పౌర సమాజం సమన్వయంతో పనిచేయాలని సూచించారు. డిస్ట్రిక్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ శ్రీనివాస్ మాట్లాడుతూ, అనాధ పిల్లలను గుర్తించి వారికి తక్షణ సహాయం, రక్షణ, పునరావాసం కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని తెలిపారు. ఈ కార్యక్రమంలో గర్ల్స్ హోమ్స్ సూపరింటెండెంట్ మైథిలీ, చైల్డ్ వెల్ఫేర్ కమిషన్ సభ్యులు ప్రమోద, సామాజికవేత్త అందె వెంకటేశ్వర్లు, అంబికా, అశ్రిత తదితరులు పాల్గొన్నారు.

సబ్ జైల్లో మెగా హెల్త్ క్యాంప్

విశ్వంభర, మహబూబాబాద్ : జిల్లా కేంద్రం లోని సబ్ జైల్లో జైలర్ మల్లెల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ప్రజా పాలన – ప్రగతి ప్రణాళికలో భాగంగా మెగా హెల్త్ క్యాంప్ నిర్వహించారు . మెగా హెల్త్ క్యాంపు లో ప్రభుత్వ వైద్యులు పాల్గొని జైలు ఖైదీల నుంచి రక్త నమూనాలు సేకరించి ల్యాబ్ కు పంపించారు . ఈసందర్భంగా కార్యక్రమాన్ని ఉద్దేశించి జైలర్ మల్లెల శ్రీనివాసరావు మాట్లాడుతూ, ప్రజాపాలనలో భాగం గా సబ్ జైల్లో ఖైదీలకు ఆరోగ్యం, పరిశుభ్రత పై అవగాహన కల్పించామన్నారు. వైద్యాధికారుల సహకారంతో విచారణ ఖైదీలకు , మొబైల్ , ఎక్స్ రే , మెషీన్లతో ,పరీక్షలు నిర్వహించడం జరిగిందన్నారు. అయిదుగురు ప్రధాన డాక్టర్లతో సహా పెద్ద సంఖ్యలో టెక్నీషియన్లు, మెడికల్ వలంటీర్లు ఏకకాలంలో ప్రతి ఖైదీకి, జైలు సిబ్బందికి సైతం వైద్య సహాయం చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ జైలర్ పట్టేం బిక్షపతి, వడ్డేబోయిన శ్రీనివాస్, సిటిజన్ ఫోరమ్ సభ్యులు శంతన్ రామరాజు, మెడికల్ ఆఫీసర్లు ఏ. అర్జున్, అనిత, ప్రియాంక, కళ్యాణి, మౌనిక, అన్నపూర్ణ, శివరాం, ల్యాబ్ టెక్నీషియన్లు, ఆశా కార్యకర్తలు , ఇతర సిబ్బంది ,తదితరులు పాల్గొన్నారు

చంద్ర రాజేశ్వరరావుకు ఘనంగా నివాళులు

విశ్వంభర, హిమాయత్‌నగర్ : కమ్యూనిస్టు ఉద్యమ ధ్రువతారగా చంద్ర రాజేశ్వరరావు నిలిచారని సిపిఐ తెలంగాణ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈ.టి. నరసింహ పేర్కొన్నారు. 32వ వర్ధంతి సందర్భంగా హైదరాబాదు హిమాయత్‌నగర్ లోని సిపిఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూమ్ భవన్‌లో సీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేదలు, అనగారిన వర్గాల కోసం జీవితాంతం పోరాడిన మహోన్నత నాయకుడిగా ఆయనను గుర్తుచేశారు. తెలంగాణ కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాణం, రైతాంగ సాయుధ పోరాటంలో కీలక పాత్ర పోషించిన నేతగా కొనియాడారు. కార్యక్రమంలో పల్లె నరసింహ, మరుపాక అనిల్ కుమార్, ఆరుట్ల రాజ్ కుమార్, కసిరెడ్డి మణికంఠ రెడ్డి, ఏ. గోవింద్ రావు, బోయ శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి బీజేపీ చేయూత

విశ్వంభర, నెల్లికుదురు: మండలంలోని రాజుల కొత్తపల్లి గ్రామానికి చెందిన వరిపల్లి రాము ఇటీవల మృతి చెందాడు.. ఆయన దశదినకర్మ పూరస్కరించుకొని బిజెపి పార్టీ జిల్లా కార్యదర్శి దారా హిందుభారతి, మండల అధ్యక్షులు చందు రాజకుమార్ యాదవ్, రాసయాకిరెడ్డి తదితర నాయకులు హాజరై రాము చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.20 వేలు అందజేశారు. ఈ సందర్భంగా హిందూ భారతి మాట్లాడుతూ, చిన్న వయసులోనే రాము అస్తమయం చెందడం బాధాకరమన్నారు. కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా నేత నల్లాని పాపారావు,ముస్తఫా,జల్లె రమేష్, విజేందర్, రామచంద్రు, మహేష్, తోటరమేష్, జిలకరయాకన్న, జి.యాకన్న, సాయి, శీను,కృష్ణ,సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు ఎండిపోకుండా కాపాడాలి

విశ్వంభర, నెల్లికుదురు: నర్సరీ లోని మొక్కలు ఎండిపోకుండా కాపాడుకోవాలని బొల్లికొండ చైతన్య నాగరాజు బాధ్యులకు సూచించారు. మండలంలోని మునిగలవీడు గ్రామ నర్సరీని పంచాయతీ కార్యదర్శి ఎండి సయ్యద్ అలీ తో కలిసి సర్పంచి గురువారం క్షేత్రస్థాయిలో సందర్శించారు. మొక్కలకు నీరు పట్టారు. వేప,కానుగ,పండ్ల మొక్కలను పరిశీలించారు.ఈ సందర్భంగా మొక్కలను నాటారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, మొక్కల పర్యవేక్షణ పట్ల సంబంధిత బాధ్యులు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు.సంరక్షించుకున్న మొక్కలనే పలుచోట్ల నాటాల్సి ఉంటుందని దీంతో పచ్చని గ్రామంగా మునిగలవీడు తయారవుతుందన్నారు. చెట్లతోనేజీవుల మనుగడ అన్నారు.

ఉస్మానియాలో క్రీడా పోటీలు

విశ్వంభర, హైదరాబాదు : ఎన్ఎస్‌యూఐ స్థాపన దినోత్సవం సందర్భంగా ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో క్రీడా పోటీలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఎన్ఎస్‌యూఐ యూనివర్సిటీ అధ్యక్షుడు మెధా శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. అతిథులుగా తెలంగాణ రాష్ట్ర డైరీ అభివృద్ధి సంస్థ చైర్మన్ అజిత్ రెడ్డి, టీటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు మోతే శోభన్ రెడ్డి హాజరై పోటీలను ప్రారంభించారు. విద్యార్థి దశలో క్రీడలు వ్యక్తిత్వ వికాసానికి దోహదపడతాయని, శారీరక ఆరోగ్యంతో పాటు నాయకత్వ లక్షణాలు, జట్టు భావన పెంపొందించడంలో కీలకమని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఎన్ఎస్‌యూఐ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని పోటీలను విజయవంతం చేశారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఎన్ఎస్‌యూఐ నాయకులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

విశ్వంభర, షాబాద్: షాబాద్ మండల పరిధిలోని రేగడి దోస్వాడ గ్రామానికి చెందిన గడీల బాలమణి భర్త జంగయ్యకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న కళ్యాణ లక్ష్మి పథకం కింద చెక్కును చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యాదయ్య మాట్లాడుతూ, పేద కుటుంబాలకు ఆర్థిక భారం తగ్గించేందుకు ప్రభుత్వం అమలు చేస్తున్న కళ్యాణ లక్ష్మి వంటి సంక్షేమ పథకాలు ఎంతో ఉపయోగపడుతున్నాయని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందేలా కృషి చేస్తున్నామని అన్నారు.ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్ రెడ్డి, రేగడి దోస్వాడ గ్రామ సర్పంచ్ పావని రమణారెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.